క్లుప్తంగా

ఆహారం శుచిగా ఉండాలి



ఆహార పదార్థాల తయారీని పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలను రుచిగా, శుచిగా వండి వడ్డించాలని ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ సూచించారు. గురువారం దంగేరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుందని, దానిని నిర్వాహకులు సక్రమంగా అమలు చేయాలని అన్నారు. అనంతరం దగ్గరుండి ఆహార పదార్థాల తయారీని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని వారన్నారు.

వృత్తిలో సేవలు ఆదర్శం



సీఈఓ గోపాల్ దంపతులను సన్మానిస్తున్న సొసైటీ చైర్మన్ రమేష్ తదితరులు

కె.గంగవరం: స్థానిక పీఏసీఎస్ సీఈఓగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన నేమాని సత్యసాయి గోపాల్ సేవలు ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. గురువారం సొసైటీ కార్యాలయం వద్ద ఆయనకు సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 37 ఏళ్లుగా సొసైటీలో సీఈఓ గోపాల్ పనిచేసి రైతులకు ఉత్తమ సేవలు అందించారన్నారు. అనంతరం గోపాల్ దంపతులను సత్కరించారు. సొసైటీ చైర్మన్ ఈదర రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేమాని సత్యనారాయణమూర్తి (అబ్బు), మాజీ ఎంపీపీ వట్టికూటి సూర్యచంద్ర రాజశేఖర్, మాజీ ఆత్మ చైర్మన్ అల్లూరి దొరబాబు, జానకిరామయ్య, వైట్ల అచ్యుతరామప్రసాద్, తోకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ జ్యూయలరీ కేంద్రం ప్రారంభం



ఆర్టిఫిషియల్ జ్యూయలరీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట రావులపేటలో మెప్మా సహకారంతో మండపేట పట్టణ సమాఖ్య సభ్యురాలు నేదూరి శ్రీదేవి పట్టణ ప్రగతి యూనిట్ పేరుతో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ జ్యూయలరీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ స్వయంశక్తితో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, శెట్టి నాగేశ్వరరావు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నక్షత్ర పూజకు ఆహ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో ఈ నెల 10న ప్రారంభం కానున్న నక్షత్ర నవగ్రహ పూర్వక మహా సౌరయాగానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును నిర్వాహకులు ఆహ్వానించారు. గురువారం మండపేటలో ఎమ్మెల్సీ తోటను తన కార్యాలయంలో కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. 10 నుంచి నెల రోజుల పాటు రోజుకొక నక్షత్రం చొప్పున 27 నక్షత్రాలకు మామిడి, వేప, విప్ప ముషిణి, ఉసిరి తదితర ప్రకృతి సిద్ధమైన ఆకులతో పూజలు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు ప్రారంభించనున్నారు. ఆహ్వానించిన వారిలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, రుద్రరాజు గిరిరాజు, సలాది పట్టాభి, కార్తీక్ ఉన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'ఇళ్ల'

రామచంద్రపురం: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇళ్ల వెంకటేశ్వరరావును జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు నియమించారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జోనల్ ఇన్‌చార్జి కాశీ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా ఇన్‌చార్జి పాట్లూరి రామ్మోహన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

పాలనలో తలుక్‌లు

- ప్రభుత్వ భవనాలకు కొత్తరూపు
- కార్పొరేట్ స్థాయిలో సచివాలయ, హెల్త్ క్లినిక్‌లు
- నేడు ప్రారంభించనున్న ప్రజా ప్రతినిధులు



సచివాలయం లోపల కార్పొరేట్ స్థాయి వసతులు

రాయవరం: ప్రభుత్వ సంకల్పానికి దాతల సహకారం తోడైంది.. ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.. దీంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ భవనాలకు కొత్తరూపు వచ్చింది. పల్లెల్లో ప్రజలకు ఒకచోట నుంచే సేవలు అందించే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ యూనిట్లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలకు ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా రాయవరం మండలం పసలపూడిలో నిర్మించిన సచివాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు కార్పొరేట్ లుక్‌తో కనిపిస్తున్నాయి. అధునాతన సౌకర్యాలతో ఇవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చూసిన ప్రతి ఒక్కరూ ఇవి ప్రభుత్వ భవనాలేనా అన్నట్టు రూపుదిద్దుకున్నాయి.

దాతల ఔదార్యంతో..

రాయవరం మండలం పసలపూడిలో పంచాయతీ భవనం శిథిలస్థితికి చేరుకోవడంతో దాని స్థానే గ్రామ సచివాలయం-1 నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి సచివాలయ భవన నిర్మాణానికి తన సొంత నిధులు రూ.40 లక్షలు వెచ్చించి, రెండంతస్తుల కార్పొరేట్ స్థాయి భవనంగా తీర్చిదిద్దారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సచివాలయ వ్యవస్థ, మొదటి అంతస్తులో పంచాయతీ కార్యకలాపాలకు చర్యలు తీసుకున్నారు. అక్కడ అధికారులు కూర్చునేందుకు వీలుగా చైర్స్, క్యాబిన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు పంచాయతీ సమావేశాల నిర్వహణకు సమావేశ హాలును నిర్మించారు. సుబ్బారెడ్డి తన తండ్రి చింతా కాటమరెడ్డి జ్ఞాపకార్థం ఈ భవనాన్ని తీర్చిదిద్దారు.

ఆకట్టుకునేలా విలేజ్ హెల్త్ క్లినిక్

గ్రామ సచివాలయానికి అనుసంధానంగా సచివాలయం-1 పక్కనే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ప్రభుత్వ నిధులు రూ.17.50 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులకు అనుబంధంగా గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి (బాబులు) తన తండ్రి మాజీ ఉప సర్పంచ్ చింతా సుబ్బారాయుడు జ్ఞాపకార్థం మరో రూ.17.50 లక్షల నిధులు జోడించారు. దీంతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఈ రెండు జోడు భవనాలు కార్పొరేట్ లుక్‌ను సంతరించుకున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన నిధులకు తోడుగా దాతల సహకారం తోడైతే ప్రభుత్వ భవనాలు ఎంత సుందరంగా మారతాయనడానికి ఈ భవనాలే చక్కని ఉదాహరణ.



చింతా కాటమరెడ్డి (ఫైల్)



చింతా సుబ్బారాయుడు (ఫైల్)



పసలపూడిలో చింతా కాటమరెడ్డి సచివాలయ భవనం



ప్రారంభానికి సిద్ధమైన చింతా సుబ్బారాయుడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్

నేడు ఎంపీ, ఎమ్మెల్సీలచే ప్రారంభం

పసలపూడిలో రూ.80 లక్షలతో నిర్మించిన చింతా కాటమరెడ్డి గ్రామ సచివాలయం-1, రూ.35 లక్షలతో నిర్మించిన చింతా సుబ్బారాయుడు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో సభను ఏర్పాటు చేసి, సుమారు ఏడు వేల మందికి అన్న సమారాధన నిర్వహించనున్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి.. పింఛను ఇచ్చి



రాజమహేంద్రవరంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి సచివాలయం-2 పరిధిలోని పింఛను లబ్ధిదారు గిరజాల వీరాయమ్మ రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆ సచివాలయ వలంటీర్ యాతం శ్రీనివాసరావు తన పరిధిలోని లబ్ధిదారైన వీరాయమ్మకు రాజమహేంద్రవరం వెళ్లి పింఛను సొమ్ము రూ.3 వేలను అందజేశారు. శ్రీనివాసరావును సర్పంచ్ ఈతకోట కిన్నెర, సచివాలయ కన్వీనర్ నామాల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పింఛన్ల సొమ్ము పెంచిన ఘనత జగన్‌దే

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



రామచంద్రపురంలో పింఛను సొమ్ము అందిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: గత ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్రలో అవ్వా తాతలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంచెలంచెలుగా పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. స్థానిక తోటవారి వీధి తదితర ప్రాంతాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యప్రకాశ్ మాట్లాడుతూ నవరత్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారని అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే పింఛన్ అందాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో పేదలకు పథకాలు కొనసాగాలంటే జగన్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కౌన్సిలర్లు తోట అమ్మాజీ, కేతా శ్రీను, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుధాసాగర్

రామచంద్రపురం: ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సహాయ ఓటర్ నమోదు అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులతో కలసి ఆర్డీఓ సుధాసాగర్ గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో మండలాల వారీగా ఆన్‌లైన్‌లో వచ్చిన ఫారం-6 దరఖాస్తులు 775, ఫారం-7 దరఖాస్తులు 356, ఫారం-8 దరఖాస్తులు 707లు మొత్తం క్లైమ్స్ వివరాలు, పెండింగ్ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరణ ఇచ్చి కాపీలను అందజేశారు. ఓటరు జాబితాలో పురుషులు 99,361, మహిళలు 1,00785, ఇతరులు ఒకరు కలిపి మొత్తం 2,00,147 మంది ఓటర్లు ఉన్నారని ఆర్డీఓ వివరించారు. ప్రతి పోలింగ్ బూత్ వారీగా జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలతో కూడిన కాపీలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఇచ్చారు. ప్రచురించిన ఓటర్ల జాబితాలు నియోజకవర్గంలో బీఎల్వోల వద్ద ఉన్నాయని తెలిపారు. ఓటరు లిస్ట్‌లో ఫొటోలు, ఇంటి నంబర్లు, ఇతర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఏఈఆర్వోలకు, బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. ఓటు నమోదు నిరంతరం ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తుది ఓటర్ల జాబితాలను పరిశీలించుకుని ఓట్ల చేర్పులు, తొలగింపులు, మార్పులు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. తుది ఓటర్ల జాబితాలను పరిశీలించి 80 ఏళ్లకు మించి ఉన్న ఓటర్లు, మంచంపై ఉండి లేవలేని, నడవలేని స్థితిలో ఉన్నవారి జాబితాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వీరికి ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా పార్టీల నాయకులు కడియాల రాఘవన్, కోట శ్రీనివాసరావు, గొల్లపల్లి కృష్ణ, సత్యవాడ శ్రీహరి పంతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పథకాల అమలు

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్



మంజేరులో పార్టీ శ్రేణులు, స్థానికులతో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: రాష్ట్రంలో పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం మంజేరు, చేదువాడ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను పలకరించి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. మంజేరులో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నూరుశాతం అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతామన్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, గ్రామ సర్పంచులు గుంటూరి అప్పారావు, గంజా దేవి, పీఏసీఎస్ చైర్మన్ గండి కిశోర్, గండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కాజులూరు: రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం చేదువాడలో ఆయన పర్యటించారు. అక్కడి మసీదును సందర్శించి ముస్లిం పెద్దలతో మాట్లాడారు. దర్గాను దర్శించి నమాజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి రావడం ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. గ్రామానికి చెందిన పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



చేదువాడలో దర్గాను దర్శించుకుంటున్న రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

రామచంద్రపురం రూరల్: ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రామచంద్రపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ వివరించారు. ద్రాక్షారామ సూర్య హైస్కూల్ ప్రాంగణంలో గురువారం ఎంవీఐ ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అతి వేగం, రాంగ్ రూట్‌లో ప్రయాణం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు. ప్రమాద సమయంలో క్షతగాత్రుల ప్రాణాలను రక్షించడానికి గంట లోపు సమీపంలోని ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. ప్రమాదాల్లో 18 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉన్నవారు అధికంగా మృతి చెందుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. దీనివల్ల వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నారని వివరించారు. డ్రైవర్లు ప్రమాదాలు సంభవించకుండా తగిన నిబంధనలు పాటించాలని కోరారు. సూర్య పాఠశాల యాజమాన్యం దొడ్డా సత్తిబాబు, ద్రాక్షారామ ఆటో, ట్యాక్సీ, టాటా ఏస్ యూనియన్ల నాయకులు, సుమారు వంద మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



రాయవరంలో బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మి



రామచంద్రపురం ఎంపీడీఓ రామచంద్రమూర్తికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రాయవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.వెంకటలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఆమె ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన కొవ్వూరి నరేంద్రరెడ్డి పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని వెంకటలక్ష్మి తెలిపారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఎంపీడీఓగా నంబాళ్ల వెంకట రామచంద్రమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్.కీర్తి స్పందన అనకాపల్లి జిల్లా పరవాడ ఎంపీడీఓగా వెళ్లారు. రామచంద్రమూర్తి అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఆయన్ని మండల పరిషత్ కార్యాలయ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు, సీనియర్ అసిస్టెంట్ కొప్పుల లాజర్, జూనియర్ అసిస్టెంట్ పి.అరుణ్ సాయి తదితరులు అభినందించారు.

విగ్రహం ఏర్పాటు నిర్ణయంపై కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును అభినందిస్తున్న బీసీ సంఘ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ఇటీవల ఆవిష్కరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడాన్ని ప్రశంసిస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును బీసీ సంఘం నాయకులు సత్కరించారు. పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గురువారం బీసీ సంఘ జిల్లా నాయకులు, 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్సీ తోటను కలసి అభినందించారు. విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానానికి కృషి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వంగవీటి మోహన్‌రంగా, మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీ సంఘం నాయకులు పెంకే గంగాధరం, కోన సత్యనారాయణ, విరమల్లు శ్రీనివాస్, మల్లువలస గణపతి, సూరంపుడి సత్యప్రసాద్, పిఠాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం



పడమర ఖండ్రికలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలం పొందిన లబ్ధిదారుల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పేదలకు ఇచ్చిన స్థలంపై లబ్ధిదారుకు సంపూర్ణ హక్కు కలిగి ఉండాలన్న లక్ష్యంతో స్థానిక సచివాలయంలోనే స్థలాన్ని లబ్ధిదారు పేరున రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో మండలంలోని గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

నేటి నుంచి ఎలుకల నివారణ మందు పంపిణీ

కాజులూరు: మండలంలో శుక్రవారం నుంచి ఉచిత ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్‌ను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం జగన్నాథగిరిలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందని గుర్తించామన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ మందును ఉచితంగా సరఫరా చేస్తుందని, మండలానికి 86 కిలోలు వచ్చిందని వివరించారు. మందు ఎరను తయారు చేసుకునే విషయంపై ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి, పలువురు రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. రైతులంతా సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

ఉత్తమ పురస్కార గ్రహీతలకు సత్కారం



ద్రాక్షారామలో పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రిపబ్లిక్ డే సందర్భంగా విద్యుత్ శాఖలో ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన రామచంద్రపురం ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, ద్రాక్షారామ లైన్‌మేన్ కోనంబల్ల రామకృష్ణలను ఆ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం సత్కరించారు. ద్రాక్షారామ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వారిద్దరినీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఏపీ ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీమోహన్, ద్రాక్షారామ ఏఈ శీలం యేసురాజు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, పి.శంకరరావు పాల్గొన్నారు.



ఎంపీడీఓ రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న గ్రామ కార్యదర్శులు, సిబ్బంది

కపిలేశ్వరపురం: రామచంద్రపురం డీఎల్‌పీఓగా విశేష సేవలందించినందుకు పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న ఎం.రామకృష్ణారెడ్డిని కపిలేశ్వరపురం మండల పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు సత్కరించారు. ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎల్‌పీఓ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

గ్రేడ్-2 హోదా కల్పించాలి

కపిలేశ్వరపురం: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న తమకు గ్రేడ్-2 హోదా కల్పించాలని గురువారం అమలాపురంలోని డీఎంహెచ్ఓ దుర్గారావుదొరకు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఏపీ విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్, ఏఎన్ఎం ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు పెంకే సుమలత, సరిత, చెల్లుబోయిన బేబీ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య కార్యకర్తలు తమ డిమాండ్‌లను డీఎంహెచ్ఓకు వివరించామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం మెయిన్ రోడ్డు ఎల్ఐసీ, చర్చి, లారీ యూనియన్ ఆఫీసు, కేఎస్ఆర్ నగర్, పసలపూడి రోడ్‌లో ఎస్‌బీఐ, వీఎస్ఎం కళాశాల, చింతపల్లి సూరన్ననగర్, గంగుమల్ల వారి వీధి, రామదుర్గా సెంటర్, గణేష్ వాటర్ ప్లాంట్, లెప్రసీ కాలనీ, పసలపూడి రోడ్డు, మినిస్టర్ హౌస్, చైతన్య రైస్‌మిల్లు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.